

# అబార్షన్ల పర్వం

**ఆల్ ఇండియా రేడియో**

---

భర్తృ విహీన కోరుకునే పవిత్రమైన ద్వితీయ వివాహాన్ని కాదంటూ చాటుమాటు వ్యవహారాన్ని సమర్థిస్తున్నది మన సంప్రదాయం... అలాంటి సంప్రదాయాన్ని మనం గౌరవించాలా?

- జయప్రద

---

ఆ అమ్మాయికి అంతర్భాగాల్లో బాధ, అంతరంగంలో బాధ.

ఆమె తనకు జరిగిన పరాభవం గురించి చెప్పుకోవడానికి నా దగ్గర సిగ్గుపడ్తోంది. సిగ్గు పడాల్సిన మృగంలాంటి మగాడు సిగ్గుపడకుండా రాజాలా తిరుగుతున్నాడు. ఈ సమాజమూ, అతని మనస్సాక్షీ కూడా అతన్ని శిక్షించవు. అతని జన్మే అంత. మన సమాజమే ఇంత.

రేప్ చేయబడిన ఆ అమ్మాయి తలవంచుకుని నిల్చుంది.

ఆమెకు గర్భం అని నాకు అన్పించినా ఇది చిన్న విషయమూ కాదు, ఆనందించే సంగతీ కాదు. దాన్ని నేను నిర్భయంగా అభినందన పూర్వకంగా డిక్లేర్ చేయడానికి...

అందుకే పెళ్ళి కాని ఆ అమ్మాయి... తల్లి కాబోతున్న నిజాన్ని నిర్ధారణ చేయడానికి ప్రెగ్నెన్సీ టెస్ట్‌కి పంపాను. రిపోర్ట్ కాగితం వచ్చింది. నేను ఏది చూడకూడదనుకున్నానో అది చూడనే చూసాను. ఆ రిపోర్ట్ చాలా నిర్దయగా ఆమె గర్భవతి అని చెపుతోంది.

నా ముఖంలోని నీలి నీడలు, కదలని నా పెదవుల నిశ్శబ్దం, ఆ అమాయకురాలి తల్లికి ఆ నిగూఢనిజాన్ని తెలియజేసినట్టుంది.

"గర్భమే కదూ?"

నేను మాట్లాడలేదు.

"పాపిష్టిదానా! ఆ ముదనష్టపు చదువులు వద్దంటే విన్నావా నువ్వు! ఇప్పుడు ఈ సంగతి తెలిస్తే మీనాయన నన్ను చంపి పాతరేస్తాడు" బిడ్డవైపు కోపంగా చూసింది ఆమె.

"ఎందుకు చంపాలి నిన్ను మీ ఆయన?"

నా కంఠంలో దాచుకున్నా దాగని కోపం.

ఏ తప్పూ చేయని ఈమెను ఈమె భర్త ఎందుకు చంపాలి? చంపాల్సివస్తే... తన నిర్దోషి కూతురు, తాలూకు శీలాన్ని అపహరించిన ఆ మనిషి అనబడే మృగాన్ని చంపాలి గానీ....

స్త్రీ శీలానికి మాత్రమే విలువ ఇచ్చే ఈ భారతదేశంలో పుట్టిన ఒక పురుషుడు నిర్భీతిగా, నిర్దయగా, నిరాటంకంగా ఆ విలువైన స్త్రీ శీలాన్ని దోచుకున్నాడు. మన సంప్రదాయాలకు ఇంత విలువ ఇచ్చే మనం ఆ సంప్రదాయాన్ని ఖూనీ చేసిన దుష్టుడికి మరణశిక్ష విధించకపోతే... అప్పుడు మనం నమ్మే సంప్రదాయాలకు నా దృష్టిలో విలువే లేదు.

"ఇంత పని జరిగాక ముఖం ఎత్తుకుని ఎలా తిరగాలి మేము?..." ఆమె కంఠంలో కన్నీళ్ళు సైతం నాలో కోపాన్ని కరిగించలేకపోయాయి.

'ముఖం ఎత్తుకుని ఎవరైనా ఈ సమాజంలో తిరగకూడకపోతే ఆ పని చేయాల్సింది నీ కూతురి శీలాన్ని అమానుషంగా అపహరించిన ఆ భ్రష్టుడు గానీ మీరు కాదు... మీరు తలెత్తుకుని తిరగడాన్ని ఈ సమాజం హర్షించలేకపోతే... మోర ఎత్తుకుని తిరిగే ఆ రాక్షసుణ్ణి ఈ సమాజం క్షమిస్తే... అప్పుడు మీరు ఈ సమాజం అనబడే అలాటి మనుషుల్ని నిర్దయగా బహిష్కరించొచ్చు. తప్పులేదు...' అని అరవాలనిపించింది. కానీ అరవలేదు. మారని సమాజంలో దోచుకోబడ్డ స్త్రీలకి ఆ సలహా ఇచ్చి మరో అశాంతిని వాళ్ళకు సృష్టించడం నా కిష్టం లేకపోయింది.

"డాక్టరమ్మా! ఈ గర్భం తీసేయండి" భయం భయంగా అడిగింది ఆ పద్దెనిమిదేళ్ళ పిల్ల. పెళ్ళయి వుంటే ఈ వయసులో తొలిసారిగా గర్భాన్ని మోస్తూ మాతృత్వపు గర్వంతో, నునుసిగ్గుతో, ఓరచూపుతో చూడాల్సిన ఆ అమ్మాయి దయనీయంగా మార్చి మార్చి చూస్తోంది మావైపు.

నిట్టూర్చాను నేను.

"అలాగే"

వాడి దౌష్ట్యానికి ఫలితంగా ప్రాణం పోసుకుంటున్న ఆ పిండాన్ని హత్య చేయడానికి నిర్ణయించుకున్నాను. అలా చేయకుండా... ఆ సాక్ష్యం ఆధారంగా కోర్టులో కేస్ వేస్తే అతనికి శిక్ష పడ్తుంది. కానీ ఈ సమాజం ఈ పిల్లకు అంతకంటే పెద్ద శిక్ష వేస్తుంది.

ఈ సమాజంలో ఈ నాగరిక లోకంలో తప్పుచేసినవాడు తలెత్తుకు తిరుగుతాడు. పెళ్ళికి అర్హుడే అవుతాడు. అన్యాయం కాబడ్డ ఈ అమ్మాయి మాత్రం పెళ్ళికి అనర్హురాలు. లేదా ఈ పిల్ల తండ్రి ఏ అయోగ్యుడినో ఎక్కువ కట్నం ఇచ్చి కొనుక్కోవాలి. ఇదీ మన సమాజం తాలూకు దుర్దశాకాండ.

* * * * *

పిలిచిందే భాగ్యం అన్నట్టు ఓ పేషెంటు వచ్చి కూర్చుంది.

"ఏమ్మా! ఏమిటి బాధ?" అడిగాను.

ఆ అమ్మాయి తలవంచుకుంది. జవాబు చెప్పలేదు.

కన్‌సల్‌టేషన్ కార్డులోకి చూపు సారించాను. ఆ అమ్మాయి నెల తప్పినట్టు వ్రాసి వుంది. తలెత్తి ఆమెవైపు చూసాను. ఆ అమ్మాయికి పెళ్ళయినట్టు లేదు. అయినా అడగడం సంస్కారం కాదు కనుక మౌనంగా పరీక్ష చేసి చెప్పాను. మూడో నెల గర్భమని. నా మాటలకు ఆ అమ్మాయి సంతోషపడలేదు. సంకోచిస్తున్నట్టుగా క్షణం చూసి అంది.

"నాకు పెళ్ళి కాలేదు."

నేను మరో ప్రశ్న వేయలేదు. ఆ అమ్మాయి దాచుకోవాలని రాలేదు. చెప్పాలనుకున్నది చెప్పుకుంటుంది... తనెందుకు ప్రశ్నలడిగి నొప్పించడం?

"అతను పెళ్ళి చేసుకుంటాననీ...."

నాకర్థమయింది. ఆ అమ్మాయి ఒంటరిగా వచ్చి 'నాకు పెళ్ళి కాలేదు' అని చెప్పినప్పుడే అర్థమయింది. పెళ్ళి చేసుకునేవాడైతే... కాబోయే భార్యను స్వయంగా తీసుకొచ్చేవాడు కదా!

"అతను నన్ను మోసం చేసాడు డాక్టర్" ఆ అమ్మాయి ఏడ్చేసింది. నేను నోరు విప్పాల్సిన టైమ్ వచ్చింది.

"ప్లీజ్ రిలాక్స్.... ఏం చదువుతున్నావు?" ఆమెకిప్పుడు సానుభూతి అవసరం.

"బి.కామ్. ఫైనల్ ఇయర్."

బి.కాం. అంటే లెక్కల్లో తెలివిగలదయ్యుండాలి కానీ ఆమె జీవితపు లెక్కల్ని మాత్రం తప్పుగా లెక్కించుకుంది.

"నీతో మరెవరైనా వచ్చారా?"

రాలేదన్నట్టు తలూపి "అతన్ని నేను నమ్మాను డాక్టర్" ఆ అమ్మాయి అశృవులు అద్దుకుంటూ అంది.

ఏ ఆడపిల్ల అయినా ఒక మగాడ్ని నమ్మితేనే కదా! సర్వస్వం ధారపోస్తుంది... ఈ పిల్లలేవిటీ పాడిందే పాడ్తారు...

తొలి అడుగు మగవాడు వేస్తాడు. 'కాద'న్న ఆడపిల్లను 'అవుననే'దాకా లాగుతాడు. తర్వాత అతని ఆకర్షణలో... అతని మైకంలో పడ్డ ఆడపిల్ల అదే ప్రేమ అనుకుంటుంది. ఆ ప్రేమలో మునిగిపోతుంది. ప్రేమించిన వాడిని నమ్మేస్తుంది. అతను కోరితే కాదనలేని బలహీనతలో పడిపోతుంది... ఆ తర్వాత ఇదీ పరిణామం.

కానీ నా కర్థంకానిదల్లా ఆ అమ్మాయిచేత ప్రేమించబడాలనే కోర్కెతో ఎంతో పాటుపడే మగాడు తర్వాత పెళ్ళిదాకా వచ్చాక ఎందుకు ఆ పట్టుదలను వదులు కున్నట్టు! స్త్రీలో ప్రేమ పెరగడం... పురుషుడిలో ప్రేమ తరగడం ఎందువలన?

నేను అసంకల్పితంగా లేచి థియేటర్‌లోకి నడిచాను. ఆ అమ్మాయికి అబార్షన్ చేస్తూ ఆ ప్రశ్నకు జవాబు వెతుక్కోవడంలో పడిపోయాను.

ఆడపిల్ల గుండెల్లో ప్రేమ రోజు రోజుకీ ఎందుకు పెరుగుతోంది? అదే మగ పిల్లాడిలో ఎందుకో తరిగిపోతుంది? ఈ ప్రశ్న కోటి ప్రశ్నలై నా మెదడును తినేస్తోంది.

ఒకే జాతిలో ఇంత వ్యత్యాసమెందుకున్నట్టు?

క్షణాలు గడుస్తున్నాయి... నా మనసు పొరలు విచ్చుకుంటున్నాయి. కారణం స్పష్టంగా గోచరమవుతోంది.

మొదటి కారణం - ఈ సమాజం. ప్రేమించి మోసగించబడ్డ ఆడపిల్లను దోషిలా చూస్తోంది. మోసగించబడ్డ మగవాడిని సానుభూతితో ఆదరిస్తోంది.

రెండోది - ఆడపిల్ల గుండెల్లో వుండేది ప్రేమ భావం. మగవాడి గుండెల్లో

వుండేది ఆకర్షణ. ఆ ఆకర్షణను అర్థం చేసుకోలేక ఆడపిల్లలు అదే ప్రేమ అని భ్రాంతిలో పడి సర్వం అర్పణచేసి - అతని ఆకర్షణ నుండి దూరమవుతున్నారు. ఆకర్షణని ఆకర్షణగానే వుంచితే... వాళ్ళ పెళ్ళి సంఘపరంగా జరిగితే.... అప్పుడు, అప్పుడే మగవాడి గుండెల్లో ఆకర్షణ ప్రేమగా మారేది.

నా చేతులు ఆమె గర్భస్థ శిశువును ముక్కలు ముక్కలుగా హత్య చేస్తున్నాయి. నా మనసు మాత్రం ఆలోచిస్తూనే వుంది.

గవర్నమెంట్ అబార్షన్‌ను లీగలైజ్ చేసి ఒక రకంగా మంచి పనే చేసింది. లేకపోతే జిల్లేడికాడల మొరటువైద్యంతో భ్రూణ హత్యతో పాటు మాతృహత్యలూ ఇంకా కొనసాగుతుండేవి.

ఆ రోజుల్లో డాక్టర్స్‌కి అబార్షన్స్ చేసే రైట్ లేనందువల్ల నాటు మంత్రసాని చేతుల్లోపడి ఎంతమంది ఇలాటి తల్లులు మృత్యుదేవతకు బలి అవుతుండేవారో!

నా చేతుల కదలిక ఆగింది కానీ నా మనసులోని కదలికలు ఆగలేదు.

* * * * *

"నేను వెళ్ళొస్తాను డాక్టర్!" నేను తలెత్తి చూసాను. ఆ కిరాతకుడి వల్ల ఆమె పవిత్రస్థానాన్ని నా వల్ల మాతృస్థానాన్ని పోగొట్టుకున్న ఆ అమ్మాయి వైపు చూసాను.

"మంచిదమ్మా. కానీ ఈ చేదు జ్ఞాపకాన్ని మర్చిపో. కానీ మరోసారి ఇలా మాత్రం రాకు."

ఆ అమ్మాయి అఫెండ్ అయినట్టు చూసింది. తర్వాత తేరుకుని అంది.

"నో డాక్టర్. ఇక అతని ముఖం చూడను. చాలా థాంక్స్ అండీ."

ఆ అమ్మాయి అలా అంది కానీ నాకు తెలుసు. ఆడపిల్లలో ప్రేమ ప్రభావం వాళ్ళ మనసుల్ని ఎంత బలహీనం చేస్తుందో, అంతగా తను ప్రేమించిన వాడిని క్షమిస్తుంది. తిరిగి తిరిగి మోసపోతుంది.

నిట్టూర్చాను.

"నెక్స్ట్ పేషెంట్‌ని పిలవమంటారా?"

పిలవమన్నట్టుగా తలాడించాను. నాకెందుకో చాలా అలసిపోయినట్టుగా వుంది ఈ రోజప్పుడే.

* * * * *

"ఎన్నో నెల?"

"ఆరో నెల."

నేను బి.పి. కట్టి చూడబోతున్నాను. ఆమె నా చెయ్యి పట్టుకుంది.

"డాక్టరమ్మా! నాకిది ఐదో కాన్పు. నాకు నలుగురూ ఆడపిల్లలు. మగపిల్లాడిని కంటే వాడేదో ఉద్ధరిస్తాడని మా పెద్దవాళ్ళు ఆపరేషన్ చేయించుకోనీలేదు. ఇదిగో జాతకం చూపిస్తే ఐదో కాన్పులో మగబిడ్డ పుడ్తాడని చెప్పారట. ఆ ఆశా పోయింది.

ఇప్పుడు.... ఇప్పుడు ఇది కూడా ఆడపిల్లేనని తేలింది. ఇంక నాకు శక్తి లేదు డాక్టరమ్మా. దీన్ని తీసేసి నాకు పిల్లల్లేకుండా ఆపరేషన్ చేసెయ్యండి." ఒక్క గుక్కలో చెప్పేసింది నాకెలాంటి శ్రమా ఇవ్వకుండా. ఆమె ప్రక్కనున్న ఆమె అత్తగారు మాత్రం దింపుడు కళ్ళెం ఆశతో అంది.

"ఇంకొక్క కాన్పు చూసేసీ...."

"ఈమె చచ్చిపోతే...." కోపంగా అన్నాను.

నా మందలింపు కూడా ఆమె ఆశను అరికట్టలేదు.

"చచ్చినరోజు కొరివి పెట్టడానికి ఒక్క కొడుకైనా వుండాలి కదా డాక్టరమ్మా?"

అంటే.... అంటే.... 'అపుత్రస్య గతిఃర్నాస్తి' అనే వేదోక్తిని ఇంకా తు.చ. తప్పకుండా పాటిస్తున్నామన్న మాట మనం! ఎంత మూర్ఖత్వం!!

"డాక్టరమ్మా! మీరు దీన్ని తీసేయండి. ఆ పుట్టేవాడేదో మొదటే పుడ్తే బావుండేది. ఇప్పుడు ఇందరు ఆడపిల్లల తర్వాత వాడొచ్చి నన్ను ఉద్ధరించేదేం లేదు. మా అవస్థలేవో మేము పడి అమ్మాయిల్ని అయ్యల చేతుల్లో పెట్టాక... వాడు పెద్దయి పెళ్ళి చేసుకుని ఆయన తెచ్చే కట్నం మమ్మల్నేం ఉద్ధరిస్తుందనీ?..."

నేను షాక్ తిన్నాను.

ఇది అపుత్రస్యగతిఃర్నాస్తి కాదన్న మాట. కొడుకైతే కట్నం తెస్తాడు. కూతురయితే ఇవ్వాలని కాబోలు.

"ఈ నాలుగుట్నీ నాలుగు కళ్ళతో కాపాడేసరికి మా పనైపోతుంది. ఇంకో దాన్నెందుకు ఈ భూమ్మీద వేయడం?...." విరక్తిగా అంటున్న ఆమె వైపు చూసాను.

ఆమె చదువుకున్నట్టు లేదు కానీ ఎన్ని నగ్నసత్యాలు చెప్తోంది!

నిజం. చదువుపేరిట, ఉద్యోగాల పేరిట, నాగరికత పెరిగిన సూచనగా గడప అవతల కాలుపెడ్తున్న ఆడపిల్లల్లో రేగే కోర్కెలకే కళ్ళాలు వేసి ఆపగలదా?.... ఆ పిల్ల

వైపు కాంక్షతో చూసి కబళించాలనుకునే హస్తాలనే అడ్డుకోగలదా? ఆ పిచ్చితల్లి.

'ఓ భరతమాతా! ఎంత దయనీయంగా బ్రతుకుతున్నావు నీవు?'

* * * * *

నా ఎదురుగా వున్నది నా పాత పేషంటు కృష్ణవేణి. ఆమె పిల్లలకోసం నా చుట్టూ తిరిగి, తిరిగి, ఆశ ఆరిపోయి నా దగ్గరకు రావడం మానేసిన కృష్ణవేణి నెలతప్పి నా దగ్గర కొచ్చిందనుకున్నాను.

కానీ నా ఊహ నిజం కాలేదు.

"అంత భాగ్యం కలగలేదు" నా ప్రశ్నకు జవాబు చెప్పి నిట్టూర్చింది కృష్ణవేణి.

"పోనీలే. ఇప్పుడు చాలా కొత్త మందులు, కొత్త పద్ధతులు వచ్చున్నాయి. నీకు తప్పక పిల్లలు కలిగేలా చూస్తాను. కూర్చో" అన్నాను అనునయిస్తున్నట్టుగా.

"నాకు కాదమ్మా! మా చెల్లెలిని తీసుకొచ్చాను. దానికి మూడోనెల ఇప్పుడు" ఆ మాటలు చెప్పేటప్పుడు కృష్ణవేణి ముఖంలో దరహాసం లేదు.

బహుశ తనకు గర్భం రాకుండా, తన కంటే ఆరేళ్ళు చిన్నదైన తన చెల్లెలికి ఆ అదృష్టం పట్టడంతో కృష్ణవేణి అసూయపడడం లేదుకదా!

"సరేఁ లోపలికి తీసుకురా. చూసి మందులు రాసిస్తాను."

"కాదు డాక్టరమ్మా! ఈ గర్భం మీ దగ్గర తీయించేసుకుని రమ్మని అమ్మ నన్ను పంపింది."

"గర్భం తీయాలా? ఎందుకు?" నేను ఆశ్చర్యపోయాను.

ఆమె మాట్లాడలేదు. తలదించుకుంది.

"బిడ్డలకోసం నువ్వు ఎంతగా ఆరాటపడ్తున్నావు! మరి ఆ అమ్మాయి గర్భం తీయించడానికి నీకు మనసెలా ఒప్పింది?"

"నా మనసు గురించి ఎవరిక్కావాలమ్మా? వాళ్ళ గర్భం. వాళ్ళిష్టం. మధ్యలో నాదేముంది?"

కృష్ణవేణి తాలూకు ఈ నిష్ఠుర వాక్యాలకు అర్థం నాకు బోధపడలేదు.

"పెళ్ళయిన సంవత్సరంలో మూడు తలలుండకూడదట. వాళ్ళ అత్తగారు తీయించమన్నారు."

"నువ్వేమంటావమ్మా" పేషంటు నడిగాను నీరసంగా.

"మా అత్తగారు వద్దంటున్నారు." చిలకపలుకులు పలికింది కృష్ణవేణి చెల్లెలు.

"మీ అమ్మ ఏమంటోంది కృష్ణవేణీ."

"ఏమంటుంది. పెళ్ళయిన సంవత్సరం మూడు తలలుండకూడదట. మా అమ్మ కూడా అంది."

నాలో ఆశ్చర్యమూ, కోపమూ ఏక కాలంలో కలిగాయి. ఎంత మూఢత్వం! పెళ్ళయిన సంవత్సరంలో భార్యా భర్త అనే రెండు తలల మధ్య బిడ్డ అనే మరో తల రాకూడదా? మన పూజ్య పూర్వీకులు అలా చెప్తేనన్నా పెళ్ళయిన కొంత కాలమైనా ఏ బాదర బందీలు లేకుండా కొత్త జంట ఆనందంగా గడుపుతారని ఈ తలకాయల సెంటిమెంట్ పెట్టారేమో.... ఇన్ని వందల సంవత్సరాల తర్వాత కూడా... ఫేమిలీ ప్లానింగ్ మన చేతుల్లో వున్న రోజుల్లో కూడా, ఇంకా... ఇంకా... అదే పాతపాటని తిరిగి తిరిగి పాడుకోవడం.... ఎక్కడికెళ్తున్నాం మనం?

"ఇప్పుడు చేస్తారా డాక్టరమ్మా?"

"ఊహు. అస్సలు చేయను."

"మీరు చేయకపోయినా ఇంకొక దగ్గరైనా ఈ గర్భాన్ని తీసేయిస్తారు. నాకు తెలుసు. ఇది మీ చేతులమీదుగానే జరిగితే నాకిష్టం."

కృష్ణవేణి ప్రాధేయపడుతోంది.

నేను వాల్ క్లాక్‌వైపు చూసాను. గంట ఎనిమిది.

"ఎంత దయనీయంగా గడచిందీ రోజు!..."

నా మనసు నిట్టూర్చింది. నా చేతులు మాత్రం మరో భ్రూణహత్యకు సిద్ధమయ్యాయి.